క్లుప్తంగా

వేమవరం వద్ద మహా ద్వారం ఏర్పాటు



ఫిరంగిపురం: వేమవరం అడ్డరోడ్డు వద్ద కోటి లింగాల మహాకాళీ సహిత మహా కాళేశ్వర స్వామి మహా ద్వారం బోర్డును మంగళవారం ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు లక్ష్మీ నారాయణ తెలిపారు. భక్తులకు గ్రామంలోని ఆలయానికి వెళ్లే మార్గం చూపెట్టేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ బాబా ఆదేశంతో దీనిని ఏర్పాటు చేశామన్నారు.

మంచి ఆలోచన సీఐ సారూ..!



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గుంటూరు- కర్నూలు రాష్ట్ర రహదారిపై పలు ప్రాంతాల్లో ఎత్తు తక్కువలో ఉన్న డివైడర్ల వద్ద వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల నివారణకు రాత్రిళ్లు డివైడర్లు కనిపించేలా సీఐ రవీంద్రబాబు చర్యలు చేపట్టారు. ఆయన తన సొంత నిధులతో 20 ఎల్ఈడీ కోన్స్‌ను డివైడర్ల వద్ద ఏర్పాటు చేయించారు. దీని ద్వారా రాత్రిళ్లు వాహనాల డ్రైవర్లకు దూరం నుంచి డివైడర్లు ఉన్నాయని తెలుస్తాయి. ఆయన వెంట రైటర్ దాసు, సుబాని ఉన్నారు.

అయ్యప్ప స్వామికి విశేష పూజలు



ఫిరంగిపురం: అమీనాబాద్ గ్రామంలోని కొండపై ఉన్న హరిహర సుత అయ్యప్ప స్వామికి మంగళవారం బాబు స్వామి విశేష పూజలు చేశారు. మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు నిర్వహించి, విశేష నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా బాబు స్వామి మాట్లాడుతూ ఈ నెల 14న సాయంత్రం 6:45 గంటలకు మకరజ్యోతి దర్శనం, విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. కృష్ణ స్వామి భక్త బృందం భజన, మూలాంకురేశ్వరి భజన సభ్యులతో కోలాట ప్రదర్శన, ఫిరంగిపురం విజయదుర్గా భజన సమాజం కోలాట ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు.

ఇంజినీరింగ్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



ఫిరంగిపురం: ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీరింగ్ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో క్యాలెండర్, డైరీలను కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు మంగళవారం ఆవిష్కరించారు. డైరీ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సాంకేతిక పరమైన సమగ్ర సమాచారం అందిస్తుందని చెప్పారు. పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరావు, సంఘం జిల్లా ప్రెసిడెంట్ షేక్.ఘన్‌సైదా, మండల ప్రెసిడెంట్ ఎం.పవన్, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


పెదపాలెంలో పొలం పిలుస్తోంది



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని శృంగారపురం, పెదపాలెం గ్రామాల్లో మంగళవారం రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పి.శిరీష మొక్కజొన్న పైరును పరిశీలించారు. మొక్కజొన్న పంటలో కాండం తొలుచు పురుగును గమనించామని, నివారణ చర్యలు వివరించారు. ఈ పురుగు నివారణకు అజ్ఞాశస్త్రం లేదా బ్రహ్మాస్త్రం పిచికారీ చేసుకోవాలని వివరించారు. యూరియా, డీఏపీ బదులు ద్రవ జీవామృతాన్ని లేదా ఘన జీవామృతాన్ని మొక్కలకు అందించాలని చెప్పారు. అప్పుడు నేల గుల్లబారి పైరు బాగా ఏపుగా పెరుగుతుందని రైతులకు తెలియజేశారు. గ్రామాల్లోని రైతులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజలపై స్మార్ట్ భారం

- విద్యుత్ స్మార్ట్ మీటర్లపై ప్రజల్లో ఆందోళనలు
- ఏర్పాటు, మరమ్మతులు అంతా ప్రయివేటు పరం
- సమయాన్ని బట్టి విద్యుత్ వాడకంపై అదనపు భారం
- ఉదయం, సాయంత్రం వేళల్లో యూనిట్‌పై అధిక ధర
- ముమ్మరంగా వ్యాపార సంస్థలకు ఏర్పాటు
- ద్రవ్యోల్బణంతో ఇప్పటికే కుదేలైన సామాన్యులు



తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ డిజిటల్ మీటర్లు తొలగించి, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ముందుగా వ్యాపార సముదాయాలకు, చిన్న చిన్న పరిశ్రమలకు బిగించే కార్యక్రమాన్ని చేపట్టగా వ్యాపారులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. వద్దన్నా కూడా విద్యుత్ శాఖ అధికారులు మీటర్లు ఏర్పాటు చేసిన వెళుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆ సమయాల్లో విద్యుత్ వాడితే అధికంగా వసూలు

ఈ స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల సెల్ ఫోన్ రీచార్జి చేసుకున్నట్లు విద్యుత్ వాడకానికి ముందుగానే రీచార్జి చేసుకోవాలి. ఇప్పటి వరకు నెలకు ఒకసారి బిల్లు వసూలు చేసే విద్యుత్ శాఖ.. ఇక రోజువారీ రీచార్జ్‌లతో వసూలు చేపట్టనుంది. ఈ స్మార్ట్ మీటర్ల భారం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా వివిధ సమయాల్లో విద్యుత్ వాడకం చార్జీ రేటు కూడా మారుతుంది. ఈ విధంగా డిజిటల్ ప్రీపెయిడ్ సిస్టమ్‌ను మీటర్లలో పొందుపరిచారు. ఉదాహరణకు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 10 గంటల మధ్య విద్యుత్ వాడితే.. నార్మల్ రేటు కంటే ఎక్కువ విద్యుత్ బిల్లు పడుతుంది. మిగతా సమయాల్లో మామూలుగా చార్జి పడుతుంది. విద్యుత్ వాడకం కొలిచేందుకు.. గతంలో యంత్రపు మీటర్లు ఉండేవి. వాటిలో ఖచ్చితత్వం లేదని డిజిటల్ మీటర్లు బిగించారు. ఇప్పుడు డిజిటల్ మీటర్లలో ఖచ్చితత్వం లేదని వాటి స్థానంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు.

కమర్షియల్‌కు స్మార్ట్ మీటర్లు

మంగళగిరి నియోజకవర్గంలో 18 విద్యుత్ సబ్ స్టేషన్లు ఉన్నాయి. వీటికింద 1.45 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 3500 కమర్షియల్ విద్యుత్ మీటర్లకు.. స్మార్ట్ మీటర్లను అధికారులు బిగించారు.

మొత్తం ప్రైవేట్ పరం..

కేంద్ర ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్ల మార్పు కాంట్రాక్ట్‌ను అదాని సంస్థకు అప్పగించింది. రానున్న మూడు నెలల్లో ప్రీపెయిడ్ బిల్లులతో మీటర్లు పనిచేస్తాయి. స్మార్ట్ మీటర్లకు సంబంధించి ఏదైనా మరమ్మతులు వస్తే సంబంధిత కాంట్రాక్టు వ్యక్తులే చేస్తారని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వమే తక్కువ ధరకు అందించాలి



ప్రభుత్వం పేపర్ బిల్లు ఇవ్వడం ద్వారా ఎంత యూనిట్లు ఖర్చవుతుందో తెలుస్తుంది. కానీ, స్మార్ట్ మీటర్లలో ఎలా తెలుస్తుంది. ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను స్థాపించి, విద్యుత్ తయారు చేయడం వల్ల తక్కువ ధరకు లభిస్తుంది. ప్రైవేటు సంస్థల వద్ద తీసుకుంటే.. వారు చెప్పిన ధరకు కొనాల్సి వస్తుంది.

– పలగాని లక్ష్మణరావు, గృహ వినియోగదారుడు

పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం



స్మార్ట్ మీటర్ల ద్వారా చాలా నష్టపోతాం. ఈ మధ్య కాలంలో ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. స్మార్ట్ మీటర్లు అంటూ బరో బరువు ప్రజల నెత్తిన వేస్తున్నారు. ట్రూ అప్, సర్దుబాటు చార్జీలు అంటూ బిల్లులు అధికంగా వస్తున్నాయి. ఇంకా స్మార్ట్ మీటర్లు అయితే ఏ చార్జీలు పడతాయో కూడా అర్థం కాదు.

– కంచర్ల కాశయ్య, సీపీఎం నేత

ఒకే రేటు నిర్ణయించాలి



స్మార్ట్ మీటర్ల ధర చాలా ఎక్కువ. ఆ భారం ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించాలి. ఇప్పుడు ప్రీపెయిడ్ అంటే ముందుగా డిపాజిట్లు వినియోగదారులకు ఎలా వస్తాయో అర్థం కావడం లేదు. ఉదయం ఒక రేటు, మధ్యాహ్నం ఒక రేటు ఇలా కాకుండా ఒకటే రేటును ప్రభుత్వం కేటాయించాలి. ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలి.

– ఈశ్వర్ రెడ్డి, రైతు సంఘం నాయకుడు

డిపాజిట్లు వెనక్కి ఇవ్వాలి



ముందుగా డిపాజిట్లు కట్టించుకుని డిజిటల్ మీటర్ బిగించారు. ఇప్పుడు స్మార్ట్ మీటర్లతో చిప్‌లో ముందుగా డబ్బులు వేసుకోవాలని అంటున్నారు. మేము కట్టిన డిపాజిట్లు ఎలా వస్తాయి. విద్యుత్ చార్జీలు తగ్గించాలని మేము కోరుతుంటే..స్మార్ట్ మీటర్లు అంటూ ప్రభుత్వం అదనపు భారం వేయడం సరికాదు.

– హరీష్, ఫ్యాన్సీ షాపు యజమాని

స్మార్ట్ మీటర్ల వల్ల నష్టం లేదు

స్మార్ట్ మీటర్ల వల్ల వినియోగదారులకు ఎలాంటి నష్టం ఉండదు. స్మార్ట్ మీటరు బిగించుకున్న వారికి 30వ తేదీ నాటికి బిల్లు వస్తుంది. ఒకవేళ సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకున్నా ఇదే మీటర్‌ను వినియోగించుకోవచ్చు. ఇప్పుడు ఎలా విద్యుత్ బిల్లు వస్తుందో అలాగే వస్తుంది. ఇంకా విద్యుత్‌శాఖ బిల్లుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

– షణ్ముఖరావు, ఏఈ, విద్యుత్‌శాఖ

మంగళగిరి ఓటర్లు 2,93,340

మంగళగిరి: మంగళగిరి నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారు. మంగళగిరి, తాడేపల్లి, దుగిరాల పరిధిలోని గతేడాది ఆగష్టు నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు బీఎల్‌వోలు సర్వే నిర్వహించారు. అక్టోబరులో అభ్యంతరాలు స్వీకరించి, వాటిపై విచారణ అనంతరం తుది జాబితా విడుదల చేశారు. ఇందులో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మంగళగిరి అర్బన్‌లో పురుషులు 32,076, మహిళలు 34,666, ఇతరులు ఐదుగురు మొత్తం 66,747 మంది ఉన్నారు. మంగళగిరి రూరల్‌లో పురుషులు 37,183, మహిళలు 40,215, ఇతరులు ముగ్గురు మొత్తం 77,401, తాడేపల్లి అర్బన్‌లో పురుషులు 25,744, మహిళలు 27,658 మొత్తం 53,402, తాడేపల్లి రూరల్‌లో పురుషులు 21,151, మహిళలు 22,812 మొత్తం 43,963, దుగ్గిరాల మండలంలో పురుషులు 24,956, మహిళలు 26,867, ఇతరులు నలుగురు మొత్తం 51,827 మంది వెరశి మొత్తం 2,93,340 మంది ఓటర్లు ఉన్నారు.

నేడు హుండీ కానుకుల లెక్కింపు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో ఉన్న మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.సునీల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభవుతుందన్నారు. ఆసక్తి గల భక్తులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.

పొట్లపాడులో రెవెన్యూ సదస్సు

మేడికొండూరు: మండల పరిధిలోని పొట్లపాడు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రీసర్వేలో తప్పులతడకపై అధికారులకు అర్జీలు సమర్పించారు. తహసిల్దారు ఎం.హరిబాబు మాట్లాడుతూ గ్రామ సభ ముఖ్య ఉద్దేశం రీసర్వేలో జరిగిన తప్పులను సరి చేస్తామన్నారు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

మంగళగిరి: ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రూరల్ ఎస్ఐ వెంకట్ ఆదేశించారు. కాజ టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించిన పోలీసులు ద్విచక్ర వాహనదారులకు అవహహన కలిగించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని ఆదేశించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లాం రెవెన్యూ సదస్సులో 34 అర్జీలు

తాడికొండ: మండలంలోని లాం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం 34 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 23 మంది, సర్వే సమస్యల పరిష్కారానికి 11 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. తహసీల్దార్ కె.నాసరయ్య అర్జీలు స్వీకరించారు.

కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్ : బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు గత 34 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందికపోవడం దారుణమని కార్మికుల పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి, మద్దతు తెలిపారు. గత 32 ఏళ్లుగా కార్మికులు తమ న్యాయమైన సమస్యను పరిష్కరించాలని అధికారులు, కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. కోర్టు తీర్పు అనుకూలంగా ఇచ్చినా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పాలక పక్షాలు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. రాజధాని రైతు సంఘం నాయకులు బి.బక్కిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర సిమెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ అనంతరం కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఈ దీక్షలో పల్లె పోగు జోసెఫ్, శీలం శంకరరావు, కూరపాటి వెంకట మోహనరావు, కుంభాల వెంకటేశ్వర్లు, కుంభాల డేవిడ్ రాజు కూర్చున్నారు. బూరగ అంకయ్య, ఎం.ఆశీర్వాదం, బి.సూర్య ప్రకాష్, కె.ఆదినారయణ, సీహెచ్ పిచ్చయ్య, వై.సాంబయ్య, రమాదేవి, శారమ్మ, దుర్గాభవాని, ఇమాంబి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్

తల్లికి వందనం వెంటనే అమలు చేయాలి

తాడేపల్లిరూరల్ : ఎన్నికలకు ముందు తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం అమలులో జాప్యం చేయడం సరికాదని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. మంగళవారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా తల్లికి వందనం పథకం అమలుకు నోచుకోకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో వచ్చే ఏడాది నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని ప్రకటించి, విద్యార్థుల తల్లి దండ్రుల ఆశలు అడియాసలు చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తల్లికి వందనం పథకం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న షేక్ సుభాని

మహానాడులో గంజాయి కలకలం

అరకేజీ గంజాయి స్వాధీనం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు ప్రాంతంలో మరోసారి గంజాయి అమ్మకాలు మంగళవారం జరిగాయి. పసిగట్టిన పోలీసులు అమ్మకాలు జరిగే ప్రాంతంలో నిఘా ఉంచారు. గంజాయి కొనుగోలు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. సేకరించిన వివరాల ప్రకారం.. మహానాడు వారధి కింద నివాసముంటున్న మణికంఠ అనే వ్యక్తి ఏజెన్సీ నుంచి భారీ మొత్తంలో గంజాయి తీసుకువచ్చి కేజీ అరకేజీ చొప్పున విక్రయాలు నిర్వహిస్తున్నాడు. మహానాడులో నివాసముండే నందు ఎలియాస్ పెద్దబారు గంజాయి సేవిస్తున్నాడని ఎస్‌బీ పోలీసులు గుర్తించారు. అతడిపై నిఘా ఏర్పాటు చేయడంతో ఈ విషయం బయట పడింది. స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మణికంఠ గంజాయిని పెద్దబారుకు ఇస్తుండగా పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో గంజాయి కొనుగోలు చేస్తున్న నందు మాత్రమే పోలీసులకు దొరికాడు. మణికంఠ మాత్రం చాకచక్యంగా తప్పించుకుని కృష్ణానది ఒడ్డున ఇసుక తిన్నెల్లో పరారయ్యాడు. నందు దగ్గర కొనుగోలు చేసిన గంజాయి కేజీన్నర ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మణికంఠ దొరికితే భారీమొత్తంలో గంజాయి లభించవచ్చని పలువురు పోలీసులు భావిస్తున్నారు. ఈ మధ్యకాలంలో తాడేపల్లి పోలీసులు గంజాయిపై దృష్టి సారించకపోవడంతో కొంతమంది పలు కాలేజీల వద్ద, పాఠశాలల వద్ద విద్యార్థులకు గంజాయి అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రతిరోజు తాడేపల్లి వినాయకుడి గుడివద్ద గేటు సెంటర్‌లో రైల్వేగేటు పక్కనే కొత్తగా వేస్తున్న రైల్వేట్రాక్ వెంబడి తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ వరకు పలువురు విద్యార్థులు, యువకులు గంజాయి తాగుతున్నారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గతంలో పలుమార్లు నందు ఎలియాస్ పెద్దబారు, అతని తమ్ముడు గంజాయి కేసులో పోలీసులు అరెస్ట్‌చేశారు.

10న వైకుంఠపురంలో ఉత్తరద్వార దర్శనం

ప్రత్యేక క్యూలైన్లతో సహా ఏర్పాట్లకు చర్యలు

తెనాలి: శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం వైకుంఠపురంలో ఈనెల పదో తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. ముక్కోటి ఏకాదశి రోజున స్వామి అమ్మవార్లు ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై వేంచేసి వుండి భక్తులకు దర్శనమిస్తారు. ఆలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, ఆలయ సహాయ కమిషనర్ /కార్యనిర్వహణ అధికారిణి వి అనుపమలు సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. పదోతేదీన తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ ఉత్సవానికి 10 నుండి 15 వేలమంది భక్తులు ఆలయానికి వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఉత్తర ద్వారంలో, మూలవరును దర్శించుకునేందుకు వీలుగా ప్రస్తుతమున్న క్యూలైన్లతోపాటు అదనంగా క్యూలైన్లు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. తాగునీరు, చిన్నపిల్లలు, బాలింతలకు పాలు సరఫరా, ఉచిత ప్రసాదం పంపిణీ ఉంటాయన్నారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ. 300 దర్శన ప్రవేశాలు ఉంటాయన్నారు. దర్శనానంతరం భక్తులకు దక్షిణావృత బంగారు శంఖుతీర్థం ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇదే సందర్భంగా ఏడు వేలమంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. వీరితో ధర్మకర్తలు, అర్చకులు అళహరి రవికుమార్, సత్యనారాయణ గౌతమ్ ఉన్నారు.

వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి అనుమతి

చినకాకాని క్యాన్సర్ ఆసుపత్రి స్థలంలో ఏర్పాటు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థకు శుభవార్త ఇది. వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నగర పరిధిలోని జాతీయ రహదారి వెంట చినకాకాని యార్లగడ్డ వెంకన్న చౌదరి అంకాలజీ రీసెర్స్ క్యాన్సర్ ఇన్స్యూట్ ఆసుపత్రి స్థలంలో వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే స్థలాన్ని పరిశీలించారు. ఇన్‌స్టిట్యూట్ స్థలంలోని 8.05 ఎకరాలను ఆసుపత్రికి కేటాయించలని ఏపీ విద్య వైద్య మౌలిక సదుపాయల సంస్థ(ఏపీ ఎంఎస్ఐడీసీ) ప్రభుత్వానికి లేఖ రాసినట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ ఓపీ కొనసాగడం లేదు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న ఈ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆసుపత్రి నిర్మాణం స్థానికులకు ఎంతో ఉపయోగపడుతుంది. మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని గత ఏడాది నవంబర్ 8న ప్రభుత్వం నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేసింది. మంగళగిరి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చేందుకు వైస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో నిర్ణయం తీసుకున్నారు. అయితే ప్రభుత్వాసుపత్రిలో అవసరమైన స్థలం లేదని అధికారులు తేల్చడంతో చినకాకాని ఆసుపత్రిలో నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.



చినకాకానిలో క్యాన్సర్ ఆసుపత్రి

తాడేపల్లి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి దేవుడు మాన్యం గ్రౌండ్‌లో జనసేన, టీడీపీ నాయకులు జొన్న రాజేష్, గాదె వినయ్ ఆధ్వర్యంలో తాడేపల్లి సూపర్‌లీగ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, గంజి చిరంజీవి, టీడీపీ తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి కొల్లిశేషు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏ విధంగా కలసి ముందుకు వెళ్తుందో చెప్పడానికి ఈ టోర్నమెంట్ ఒక నిదర్శనన్నారు. జనసేన మంగళగిరి మండల అధ్యక్షులు వాసా శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు అంబటి తిరుపతిరావు, తాడేపల్లి కార్యదర్శి చాముండేశ్వరి దేవి, 19వ వార్డు అధ్యక్షుడు కాసమని దినేష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

చెప్పుల షాపులో అగ్ని ప్రమాదం

తాడేపల్లి రూరల్: మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి డోలాస్‌నగర్, నులకపేట మధ్య చెప్పుల షాపులో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో చెప్పుల షాపు మొత్తం పూర్తిగా దగ్ధమైంది. మంగళగిరి అగ్నిమాపక ఎస్ఎఫ్ఓ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడకు చెందిన షేక్ బాజీ రోడ్డు పక్కన చెప్పులు విక్రయిస్తుంటాడు. సాయంత్రం చెప్పులను గొడౌన్‌లో భద్రం చేసి ఇంటికి వెళ్లాడు. గొడౌన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి షాపులో ఉన్న చెప్పులు పూర్తిగా కాలిపోయాయి. స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది మంటలు అదుపులోకి తెచ్చినట్లు తెలిపారు. బాజి వస్తే గానీ నష్టం ఎంత అనేది తెలియదన్నారు.



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

క్యాలెండర్ ఆవిష్కరణ

తాడేపల్లిరూరల్ : ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ కార్యాలయంలో దుగ్గిరాల యూనిట్ అధ్యక్షుడు అందె బాలచంద్ర మౌళి, తహసీల్దార్ ఐ. సునీత మంగళవారం ఆవిష్కరించారు. చంద్రమౌళి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్‌బాషా ఆదేశాల మేరకు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించామన్నారు. ఎంపీడీఓ అడిగోపుల శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు వంకదార సుబ్బారావు, ఉపాధ్యక్షులు గుంటూరు పూర్ణ ప్రసాద్, పులివర్తి చిట్టిబాబు, ఈఓపీఆర్డీ కావూరి జవహర్‌లాల్ నెహ్రూ, డిప్యూటీ తహసీల్దార్ బి.కనకదుర్గ సిబ్బంది పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అందె బాలచంద్రమౌళి, తహసీల్దార్ సునీత

భర్త హత్యకు తెగించిన భార్య

తప్పించుకుని పోలీసులను ఆశ్రయించిన భర్త

మంగళగిరి: భర్త హత్యకు తెగించిన భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన మంగళగిరి రూరల్ పరిధిలో జరిగింది. నగర పరధిలోని యర్రబాలెంలో ఓ మహిళ ప్రియుడితో కలిసి భర్త హత్యకు పథకం వేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఓ రౌడీ షీటర్ సహాయం తీసుకుని భర్తను హత్య చేసేందుకు ప్రయత్నించగా తప్పించుకున్న భర్త మంగళగిరి రూరల్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో అతని భార్యతో పాటు పాటు మరో ముగ్గురుని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: మైనర్ బాలికపై దాడి చేసిన తల్లి, పెద్దమ్మ, పెదనాన్నలను పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ మారిస్‌పేట ఆర్ఆర్‌నగర్‌కు చెందిన బాలికపై ఆమె తల్లి దుర్గ, పెద్దమ్మ బషీరున్నీసా, పెదనాన్న సింహాచలం దాడి చేసిన ఘటన గత జులై నెలలో వెలుగు చూసింది. ఘటనపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి బాలికను గుంటూరులోని సంరక్షణ కేంద్రానికి పంపారు. నిందితులైన ముగ్గురిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆకస్మిక మృతి

నివాళులర్పించిన సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

తాడికొండ: పొన్నెకల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పప్పుల శంకర్ రెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సోమవారం బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ మరణించారు. తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు శంకర్ రెడ్డి మృత దేహానికి నివాళులర్పించి, పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని, అధైర్యం చెందవద్దని భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, దాసరి రాజు, వంగా పోలారెడ్డి, భీమవరపు బ్రహ్మారెడ్డి, సీతారామిరెడ్డి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని శంకర్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.